క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ



ఎంపీడీఓను సన్మానించిన సమాఖ్య ఉద్యోగులు

కొడంగల్: ఎంపీడీఓగా ఉషశ్రీ సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కార్యాలయ, మహిళా సమాఖ్య, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఉష శ్రీ కొడంగల్‌కు రాకముందు, అపార్డు ట్రెయినింగ్ సెంటర్‌లో శిక్షకురాలిగా పనిచేసే వారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న పాండును పూడూరు మండలానికి బదిలీ చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కొడంగల్: రోడ్డు భద్రతపై డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లు నడిపే వారు సీటుబెల్టు ధరించాలని చెప్పారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శివరాం గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రఫియా, కో ఆర్డినేటర్ రాంబాబు, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సోమ్లా, శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

16న లోక్ అదాలత్

దౌల్తాబాద్: ఈ నెల 16న కొడంగల్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ సోమవారం తెలిపారు. చిన్నచిన్న కేసుల్లో ఉన్న కక్షిదారులు.. ఈ కార్యక్రమం ద్వారా రాజీ కుదుర్చుకోవాలని ఆయన సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తాండూరు టౌన్: తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ అసోసియేషన్ (టీపీఈఏ) అధ్యక్షుడిగా సత్యం పటేల్, నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సత్యం పటేల్, ప్రధాన కార్యదర్శిగా వీరేశం, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ బషీర్, కోశాధికారిగా వహీద్, సలహాదారులు, సభ్యులుగా నందకుమార్, ఆమేర్, మల్లేశం, తబ్రేజ్, వాజీద్‌ను నియమించారు. ఇందులో నగేష్, రవి, ఎల్లప్ప, నిస్సార్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెలోషిఫ్ సభ్యుల డిమాండ్



నిరసన తెలుపుతున్న పాస్టర్లు తదితరులు

చేవెళ్ల: క్రైస్తవుల, చర్చిలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెలోషిఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టీడీఎస్ మణి డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి మండలంలోని జన్వాడలో జరిగిన సంఘటనకు వ్యతిరేకిస్తూ.. సోమవారం నిసరన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్వాడలో క్రైస్తవులు, చర్చిపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో బాధితులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతున్నాయని, వీటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేని యెడలా అన్ని క్రిస్టియన్ సంఘాలు ఏకమై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన సభలో వ్యవస్థాపక అధ్యక్షుడు దానియల్, రవికుమార్, వివిధ సంఘాలకు చెందిన చర్చిల పాస్టర్లు కిష్టపర్, సామేల్, జహంగీర్, దానియల్, యేసుదాస్ పాల్గొన్నారు.

చేవెళ్ల ట్రాఫిక్ సీఐగా వెంకటేశం



చేవెళ్ల: చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓగా సీఐ ఎస్. వెంకటేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చేవెళ్లలో ట్రాఫిక్ సీఐగా పని చేసిన సైదులు కమిషనర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో డీఐ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎస్. వెంకటేశం చేవెళ్లకు బదిలీపై వచ్చారు.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

షాద్‌నగర్: మహారాష్ట్రలో జరిగిన ఆల్ ఇండియా కుంగ్‌ఫూ, కరాటే జూడో ఛాంపియన్‌షిప్ పోటీల్లో షాద్‌నగర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. బ్రేవ్ యూత్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో స్థానిక పవర్‌కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థులు జశ్వంత్, సాత్విక్, రాహుల్, ప్రేమ్‌కుమార్‌లు ఉత్తమ ప్రతిభను కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు. వీరికి పథకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ వీరాచారి, మాస్టర్లు బాల్‌రాజ్, హైమద్ పాల్గొన్నారు.

త్వరలోనే ప్రజాపాలన కేంద్రాలు

- ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాటు
- నిరంతరం గ్యారంటీ పథకాల అర్హుల నుంచి అర్జీల స్వీకరణ



ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

దౌల్తాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు అర్హులైన వారి నుంచి నిరంతరంగా అర్జీల స్వీకరణకు ప్రక్రియ చేపట్టింది. గతంలో ప్రజాపాలన ద్వారా సంక్షేమ పథకాలకు అర్హులైన వారు అందరూ దరఖాస్తులు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే వాటిల్లో ఎలాంటి తప్పులు ఉన్నా.. ఇంకా అర్జీ పెట్టుకోని వారు ఎవరైనా ఉన్నా.. వారి నుంచి దరఖాస్తుల స్వీకరించేందుకు ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్లలో ఆరు గ్యారంటీల అర్హులకు ఎలాంటి సహాయం కావాలన్నా, సమస్య ఉన్నా పరిష్కారం లభించనున్నట్లు పలువురు పేర్కొన్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఈ కేంద్రాలను సోమవారం నుంచి ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే స్థానిక అధికారులు మాత్రం తమకు ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పడం గమనార్హం. అయినప్పటికీ త్వరలో అందుబాటులో రానున్నట్లు సమాచారం.

అర్జీల స్వీకరణ

ప్రజాపాలన సేవా కేంద్రాలు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5వరకు పనిచేస్తాయి. వీటిల్లో కంప్యూటర్ ఆపరేటర్ అందుబాటులో ఉంటారు. గ్యారంటీ స్కీంల అప్లికేషన్లలో ఎలాంటి తప్పులు ఉన్నా సరిచేస్తారు. కొత్త అర్జీలను స్వీకరిస్తారు. తగిన సలహాలు, సూచనలు ఇస్తారు.

కూలిందా.. కూల్చేశారా?

నెల రోజులుగా పట్టించుకోని అధికారులు



జీపీ కార్యాలయ బోర్డు పరిస్థితి

పెద్దేముల్: ఊరికి కొత్తగా నాయకుడు, అధికారి ఇంకెవరైనా వచ్చినా ముందుగా అడిగేది గ్రామ పంచాయతి కార్యాలయం ఎక్కడా అని. అలాంటిది ఆ కార్యాలయం బోర్డు నెల రోజులుగా కిందపడి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఈ బోర్డు కింద పడిందా? లేక ఎవరైనా కావాలనే తీసేశారా? అని గ్రామస్తులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. పెద్దేముల్ మండలం గోట్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం బోర్డు ఒకవైపు మొత్తం కిందకు ఒరిగి ఉంది. నెల రోజులుగా అలాగే ఉన్నా.. దానిని పట్టించుకునే వారే లేరు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో బోర్డు గురించి ఎవరిని అడగాలో తెలియక.. జీపీ కార్యదర్శిని స్థానికులు అడిగినట్లు సమాచారం. ఇప్పటికైనా వెంటనే ప్రత్యేక అధికారులు స్పందించి, కొత్తగా గ్రామ సచివాలయం బోర్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

పరిగి: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం బుధవారం తన నివాసంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షలో పార్లమెంట్ ఎన్నికల గురించి చర్చించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ సునితారెడ్డి హాజరు కానున్నారని, కావున నాయకులు, కార్యకర్తలు రావాలని పిలుపునిచ్చారు.

సమస్యల పరిష్కారానికే స్పెషల్ డ్రైవ్



పెద్దేముల్: ధరణి సమస్యల గురించి తెలుసుకుంటున్న రెవెన్యూ అధికారులు



బంట్వారం: దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

- కార్యక్రమాన్ని వినియోగించుకోండి
- తహసీల్దార్లు కిషన్, ప్రవీణ్‌కుమార్

పెద్దేముల్: ధరణి సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కిషన్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ తెలిపారు. సోమవారం మండల పరిధి తట్టెపల్లి రెవెన్యూ గ్రామంలో ప్రత్యేక పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి దరఖాస్తు చేసుకున్న సుమారు 20 మంది రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే.. ధరణిలో అర్జీ పెట్టుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రాజిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వేణు, జూనియర్ అసిస్టెంట్ అవినాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర చర్యలు

బంట్వారం: ధరణి సమస్యలపై సత్వర చర్యలకు శ్రీకారం చుట్టామని బంట్వారం తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆయన రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ధరణి దరఖాస్తులు 267 పెండింగ్‌లో ఉన్నాయని, అర్జిదారులతో నేరుగా చర్చించి, అప్పటికప్పుడే పరిష్కరిస్తామని వివరించారు. ఈ నెల 9వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, అర్జిదారులు రెవెన్యూ అధికారులకు సహకరించి, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు విజయ్ భాస్కర్, తులసీరామ్, సీనియర్ అసిస్టెంట్ రాజేందర్ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు



తాండూరు రూరల్: సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- గ్రామాల్లో శరవేగంగా కొనసాగుతున్న రోడ్ల నిర్మాణం
- కాంగ్రెస్ శ్రేణులు

యాలాల: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు భీంషెట్టి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధి చెన్నారం గ్రామంలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భీమప్పతో కలిసి రూ.8లక్షల నిధులతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా భీంషెట్టి మాట్లాడారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఉపాధి నిధులతో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో మాజీ సర్పంచ్ సాయిలు తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం మండల పరిధి చంద్రవంచ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే ఎన్ని నిధులైనా ఇస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో సీసీరోడ్ల పనులు ప్రారంభించామని తెలిపారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు విజయ్ కుమార్, అంజిలప్ప, అనంతప్ప, నర్సింహులు, బాలకృష్ణ, గోపాల్, ఎల్లప్ప, మంజూర్‌లు ఉన్నారు.

రాంసింగ్ నాయక్ తండాలో..

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ చౌడాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్ అన్నారు. మండల పరిధి రాంసింగ్ నాయక్ తండాలో రూ.7లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించి, చారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నాయకత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

సీసీరోడ్డు పరిశీలన

బంట్వారం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు శాకం నర్సింహులు అన్నారు. బస్వాపూర్ గ్రామంలో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణం పనులను సోమవారం వారు స్పెషల్ ఆఫీసర్ రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి, నాయకులు కృష్ణ, ఆనందం తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్లలో..



బంట్వారంలో..

చిన్నారులకు చుక్కల మందు తప్పనిసరి



వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి వాజుద్దీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు. సోమవారం మండల పరిధి రాంపూర్, కుస్మసముద్రం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, పిల్లలకు చుక్కల మందు వేయించారా అని పెద్దలను అడిగి తెలుసుకున్నారు. డ్రాప్స్ వేసుకున్న వారి వివరాలను నమోదు చేసుకోవాలని ఆశలకు సూచించారు. చుక్కలు వేయడం వలన పిల్లలకు భవిష్యత్తులో పోలియో సోకకుండా ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మంగమ్మ, భారతమ్మ, సుమలత, పద్మ, సుక్కమ్మ, సుజాత, రఫీ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

కొందుర్గు: మండల కేంద్రంతో పాటు జిల్లేడ్ చౌదరిగూడ మండలం చెన్నారెడ్డిగూడలో సోమవారం శివనామస్మరణ మార్మోగింది. కొందుర్గులో గురుస్వామి సత్యనారాయణ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ నిర్వహించి, ఇరుముడి ధరించి శివ భక్తులు శ్రీశైలం మల్లికార్జున చెంతకు వెళ్లారు. అదే విధంగా చెన్నారెడ్డిగూడలో గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో శ్రీనివాస పౌల్ట్రీ ఫాంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు.

చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

షాబాద్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో పెద్దవేడు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు అడిగే హక్కులేదని, రాష్ట్రం తెచ్చిన కేసీఆర్‌కు మాత్రమే ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అందరికీ అన్ని ఇస్తామని, చెప్పి.. కొందరికే ఇస్తామంటుందని ఎద్దేవా చేశారు.

పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి



ఎగ్జామ్ కిట్స్ అందజేసిన చైర్మన్ రవినాయక్

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తుందని ట్రస్ట్ అధ్యక్షుడు రవి నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధి అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు దాతలు హైమావతి, సుచిత్ర సహకారంతో పరీక్ష రాసేందుకు కిట్స్ అందజేశామని, పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో అవి వారికి ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రేణుక, ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగేష్, సంగీత, సుధా పాల్గొన్నారు.

మహిమాన్వితుడు రామలింగేశ్వరుడు

- భక్తుల కొంగు బంగారంగా స్వామివారి ఆలయం
- సాక్షాత్తు శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం
- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- మహాశివరాత్రి వరకు కొనసాగనున్న జాతర



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన రామలింగేశ్వరస్వామి దేవాలయం

షాద్‌నగర్‌రూరల్: కాశీశైవ క్షేత్రంగా ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయం దినదిన ప్రవర్ధమానంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయంలో సాక్షాత్తు శ్రీరామచంద్రస్వామి శివలింగాన్ని ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. స్వామిని దర్శించుకునేందుకు తెలంగాణతో ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. స్వామివారు భక్తులు కోరిన కోరికలను తీరుస్తూ.. కొలిచే వారికి కొంగు బంగారంగా నిలుస్తున్నారు. సోమవారం నుంచి రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 11న ముగియనున్నాయి.

ఆలయ చరిత్ర..

లంకలో రావణాసురుడిని వధించిన తరువాత శ్రీరాముడు అయోధ్యకు బయలుదేరాడు. సీతాదేవిని అరణ్యమార్గం నుంచి అయోధ్యకు తీసుకువెళ్తూ కోటి లింగాలను ప్రతిష్ఠిస్తున్నాడు. ఈనేపథ్యంలో సాయంసంధ్య వేళలో పుణ్యస్నానమాచరించిన శ్రీరాముడు ఉత్తర రామేశ్వరంలో శివపూజ కోసం శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తాడు. శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం నాటి నుంచి నేటి వరకు ఇక్కడ ఉత్తర రామలింగేశ్వరస్వామిగా భక్తులచే నిత్య పూజలను అందుకుంటున్నారు. ఈ శివలింగంపై బాణం గుర్తు కనిపిస్తుంది.

పెరుగుతున్న శివలింగం

శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం ఎంతో మహిమాన్వితమని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ ఆలయంలో శివలింగానికి మరొక ప్రత్యేక ఉంది. గర్భగుడిలోని శివలింగం ఏటా పెరుగుతూ భక్తులను ఆశ్చర్య పరుస్తోంది. ప్రతి పౌర్ణమికి భక్తులు వేల సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

ఇతర జిల్లాల నుంచి..

ఏటా మహాశివరాత్రిని పురస్కరించుకొని దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు.

అన్ని సౌకర్యాలను కల్పిస్తాం



రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకంగా క్యూలైన్‌లు ఏర్పాటు చేశాం. ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని టెంట్లు వేయించడం జరిగింది. ఆలయం ఆవరణలో మంచినీటి వసతి, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేశాం.

– శివకుమార్, ఆలయ ఈఓ, రామేశ్వరం

కోరికలు తీర్చే దైవం



శ్రీరాముడు స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ శివలింగానికి ఎంతో మహిమ ఉంది. ఉత్తర రామేశ్వరం దేవాలయంలో వెలిసిన శివలింగానికి పూజలు నిర్వహిస్తే ఎంతో పుణ్యం లభిస్తుంది. ఏటా శివరాత్రి సందర్భంగా దేవాలయంలో బ్రహ్మోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తాం.

– రవీందర్‌రావు, ఆలయ ధర్మకర్త, చైర్మన్, రామేశ్వరం

‘ప్రజాదీవెన’ జయప్రదం చేయండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాహుల్‌గాంధీ చేపట్టిన న్యాయ యాత్రకు సంఘీభావంగా 6న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న ప్రజాదీవెన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నెలకొన్న అవినీతి, అన్యాయాలు, దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా రాహుల్ దేశ వ్యాప్తంగా న్యాయయాత్రకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. సంఘీభావంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ వ్యాప్తంగా ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి పాలమూరు న్యాయ యాత్రను చేపట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలనే లక్ష్యంతో యాత్రకు చేపట్టడం జరిగిందన్నారు. ప్రజాదీవెన సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని వెల్లడించారు. అనంతరం ప్రజాదీవెన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు మహ్మద్‌అలీఖాన్ బాబర్, తిరుపతిరెడ్డి, రఘు, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, రాజు, కృష్ణారెడ్డి, కావలిశ్రీశైలం, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, ముబారక్‌అలీ, రాజేందర్‌రెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చాప్‌కట్టర్స్‌కు అనుమతి ఇవ్వండి

భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి

షాబాద్: పాడి రైతులకు చాప్‌కట్టర్స్ వాడుకోవడానికి విద్యుత్ అధికారులు అనుమతి ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి కోరారు. సోమవారం షాబాద్ రైతు వేదికలో పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిరైతులకు పొలాల వద్ద చాప్‌కటర్స్‌లను వాడుకోవడానికి విద్యుత్ అధికారులు అనుమతి ఇవ్వాలన్నారు. పశువులకు మేత కోసం చాప్‌కట్టర్లను వాడుతున్న రైతులపై విద్యుత్ శాఖ అధికారులు ఫెనాల్టీ వసూలు చేస్తున్నారని వాపోయారు. చాప్‌కటర్ల కోసం పాడిరైతులు డీడీలు చెల్లిస్తామని, అనుమతి ఇవ్వాలని విద్యుత్ అధికారులను కోరారు.